
# శిశుర్నవం



"మి సెస్ సుజాత.... మిసెస్ సుజాత" నర్స్ గొంతెత్తి పిలుస్తోంది.

"ఆ....వస్తున్నా!" ఒకమ్మాయి లేచి, భారంగా నడుచుకుంటూ నర్స్‌తో కన్సల్టింగ్ రూంలోకి వెళ్లింది.

గీత విసుగ్గా టైం చూసుకుంది. ఏడయింది. తను వచ్చి గంట పైనే అయింది. ఇంకెంతసేపు పడుతుందో! అప్పటికే మనోజ్ నుంచి రెండు ఫోన్ కాల్స్.

వెయిటింగ్ హాల్ ఆడవాళ్లతో కిక్కిరిసింది. దాదాపు అంతా గర్భిణులే! వాళ్లను చూస్తుంటేనే తెలుస్తున్నది, గైనకాలజిస్ట్‌గా డాక్టర్ సుమిత్ర పేరు, ప్రతిష్ఠలు ఎలాంటివన్నది.

టీ.వీ. స్క్రీన్ మీద గర్భధారణ గురించి, నెలలవారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించిన వివరాలు వాయిస్ ఓవర్‌తో చూపుతున్నారు. గుడ్ ఎడ్యుకేషన్. అక్కడున్న స్త్రీలకు, ప్రాథమిక విజ్ఞానంతో పాటు కొంత కాలక్షేపం.

గీతకు మనసులో అశాంతిగా వుంది. డాక్టర్ ఏమంటుందోనన్న భయమూ కలుగుతోంది. తగిన సమయంలో సరైన నిర్ణయం తీసుకోలేదేమోనన్న శంక పీడిస్తున్నది.

"మనో! పొరపాటు జరిగింది. నాకు ప్రెగ్నన్సీలా వుంది" మనోజ్‌తో అంది.

అతని ముఖంలో ఆనందం కనిపించలేదు. ఆందోళనగా చూశాడు. ఇందులో తనను తప్పు పట్టాల్సింది ఏం లేదని అతనికి తెలుసు.

మొదటి సారిగా తను తల్లిని కాబోతున్నానని చెప్పినప్పుడు మనో గొప్పగా ఫీలయ్యాడు. అభినందనలతో ముంచెత్తాడు. ఆర్భాటం చేశాడు. అపురూపంగా చూసుకున్నాడు. అప్పట్లో తాము బిడ్డను కోరుకున్నారు గనుక ఆ ఆనందం, మధురానుభూతి.

ఇప్పుడు పరిస్థితి అలాంటిది కాదు. రెండో బిడ్డ గురించిన ఆలోచన లేదు. 'ఒక బిడ్డ మాత్రం చాలదా?' అనీ అనుకోకపోలేదు.అదే తొలికాన్పులో మగపిల్లాడు గనుక పుట్టుంటే మరో బిడ్డ గురించిన ఆలోచన మనోజ్‌కి వచ్చుండేది కాదేమో!

"గీతా! అబార్షన్ చేయించుకో" వారం తర్వాత మనోజ్ తన నిర్ణయం చెప్పాడు. గీత మనసు చివుక్కుమంది. ఏకపక్షంగా అతను ఒక నిర్ణయానికి రావటమేంటి? తామిప్పుడు బిడ్డను కావాలనుకోలేదు. నిజమే! అనుకోకుండా బిడ్డ కడుపులో పడింది. వద్దనుకోవటం ఎంతవరకు సమంజసం. ఒకవేళ మగబిడ్డే అయ్యుంటే ఎంత దురదృష్టం. కోరుకున్నప్పుడు కోరుకున్న బిడ్డను కనగలమా?

"అయిందేదో అయింది. మరో బిడ్డ కావాలనుకున్నప్పుడు ఎప్పుడైతేనేం?" తన అయిష్టతను వ్యక్తం చేసింది.

"బాగా ఆలోచించు. మనం పెంచలేమనుకోబట్టే గదా పాపను మీ అమ్మా, నాన్న పెంచుతోంది. రెండేళ్లన్నా కాకుండానే మళ్ళీ బిడ్డను కనిస్తే పెంచేవాళ్ళెవరు?"

"మన పిల్లల బాధ్యత మా అమ్మా,నాన్నలదేనా? ఏం ఈ సారి పుట్టేబిడ్డను మీ అమ్మా, నాన్నలు పెంచొచ్చుగా! బిడ్డను వాళ్ల దగ్గరుంచుకున్నా సరే, కొంతకాలం మన దగ్గరకొచ్చి వున్నా సరే! అడిగి చూడండి" తరుణోపాయం చెప్పింది గీత.

ఒకవారం తర్వాత గాని విషయం తేలలేదు. "గీతా! అమ్మా, నాన్నలతో మాట్లాడాను. ఇక్కడ బిడ్డను పెంచనూలేము. అక్కడికొచ్చి వుండనూ లేమన్నారు" చెప్పాడు మనోజ్.

రేఖ తల్లికీ విషయం చెప్పి, సలహా ఏమైనా చెప్తుందేమోనని ఎదురుచూసింది. నిర్ణయం తమకే వదలివేస్తున్నట్లుగా మౌనం వహించిందామె. మళ్ళీ మళ్ళీ తల్లిని అడగటం తనకు ఇష్టంలేకపోయింది.

ఆఫీసులో ప్రాజెక్టు వర్క్ వత్తిడి బాగా వుండటంతో ఆ విషయం గురించి మళ్లీ చర్చించడానికి అవకాశమే లేకుండా పోయింది. నిద్రలేవటం, ఎవరిపాటికి వాళ్లు తయారై ఆఫీసులకు పరుగులు పెట్టడం, తిరిగి రావడం, అలసటతో బెడ్ మీద వాలిపోవటం.....సమస్య గురించి చర్చించే సమయమే చిక్కలేదు.

అట్లానే పదిహేను వారాలు గడిచిపోయింది.కడుపులో పెరుగుతున్న బిడ్డ శారీరక ఆరోగ్యం మీద ప్రభావం చూపడం మొదలవడంతో ఆందోళన పడసాగింది.ఏదో నిర్ణయం తీసుకోవటం మంచిదనుకొంది.

"గీతా! అబార్షన్ అన్నివిధాల ఉత్తమం. మెటర్నిటీ లీవ్‌లో వెడితే తిరిగి జాబ్‌లో చేర్చుకుంటారన్న గ్యారంటీ లేదిప్పుడు. ఐ.టి.రంగం దెబ్బతిన్న విషయం నీకూ తెలుసు. ఎంతమందిపోతే అంత మంచిదనుకుంటున్నారు కంపెనీవాళ్లు. హౌసింగులోను, కారులోను, పర్సనల్ లోన్....ఇలా వీలయినవన్నీ పెట్టుకున్నాం. ఈ పరిస్థితుల్లో ఎలాంటి నిర్ణయం మంచిదో బాగా ఆలోచించు." మనోజ్ ఒక అర్ధగంట క్లాసు తీసుకున్నాడు.

ఆ రోజంతా మనసు పాడైంది. బిడ్డ ముఖ్యమా? ఉద్యోగం ముఖ్యమా? ఇందులో ఒకటి తన చేతుల్లో పని. రెండోది తన చెప్పుచేతల్లో లేనిది. బిడ్డా, భవిష్యత్తా?

"మిసెస్ గీతా! మిసెస్ గీతా!" నర్స్ పిలుపుకు ఆలోచనల్లోంచి బయటపడింది.

"వాటీజ్ ద ప్రోబ్లమ్" చిరునవ్వుతో అడిగింది డాక్టర్ సుమిత్ర.

"అబార్షన్ చేయాలి" చెప్పింది.

"లాస్ట్ టైమ్ పీరియడ్స్ ఎప్పుడొచ్చాయి?"

గీత చెప్పింది. డాక్టర్ కాగితం మీద లెక్కలువేసి, "పందొమ్మిది వారాలు దాటింది. బిడ్డ వద్దనుకుంటే ఇంతాలస్యం దేనికి చేశావు? ప్రెగ్నెన్సీ రాకుండా ముందే తగిన జాగ్రత్తలు ఎందుకు తీసుకోలేదు?" డాక్టరు గొంతులో సీరియస్‌నెస్.

"అనుకోకుండా ఏదో జరిగిపోయింది. సేఫ్ పీరియడ్....ఏం కాదనుకున్నాను. బిడ్డను కనాలా, వద్దా అని వెంటనే తేల్చుకోలేకపోవటం కూడా ఆలస్యానికి కారణం."

"అమ్మతనాన్ని మీ తరం ఆషామాషీగా తీసుకుంటోంది. ఒక బిడ్డను కాదని పుట్టుకను నిరోధించటం, ఒక పువ్వును తుంచి తలలో పెట్టుకున్నంత సులభం కాదు. రెండో బిడ్డను కాదనుకోనప్పుడు ఎప్పుడు కంటేనేం?" ఆ మందలింపులోని వాస్తవికత గీతను వణికించింది.

"సారీ డాక్టర్! జాబ్ సెక్యూరిటీ.... డబ్బు అవసరాలు....టెన్షన్స్ ... కొంతకాలం బిడ్డ ఆలనాపాలనా చూడటానికి సహకరించేవాళ్లు లేకపోవటం... ఇలా చాలా కారణాలు నన్ను ఒత్తిడికి గురిచేస్తున్నాయి." గీత కళ్లల్లో తడి.కొద్ది నిమిషాల్లో తన ప్రాబ్లమ్స్ చెప్పింది.

"ఓ.కె. ఒక గంటలో మీ భర్తను కూడా రమ్మనండి.తను వచ్చాక ఏం చేద్దామన్నది డిసైడ్ చేద్దాం. ఈలోగా నా ఓ.పి. కూడా అయిపోయింది ప్లీజ్ వెయిట్" సానుభూతితో స్పందించింది డాక్టర్.

గంట గడిచాక మనోజ్ కంగారుగా వచ్చాడు.డాక్టరన్నమాటలన్నీ వివరంగా చెప్పింది. తక్షణం తనను పిలిపించాల్సిన అవసరమేంటో బోధపడలేదు మనోజ్‌కి.

డాక్టర్ ఓ.పి. అయ్యాక పిలుపొచ్చింది. ఇద్దరూ కన్సల్టింగ్ రూంలోకి అడుగుపెట్టారు. కొన్ని సాధారణ విషయాలు మాట్లాడాక అసలు విషయంలోకి వచ్చింది డాక్టర్.

"మీ దృష్టిలో అబార్షన్ అనేది వెరీసింపుల్ థింగ్. మీరూ, నేనూ మరికొందరు డాక్టర్లూ కలిసి చట్టబద్ధంగా చేస్తున్న హత్య. ఈ దారుణకృత్యం ఎవరికంటా పడదు" ఈ ఉపోద్ఘాతం ఆవిడ ఏ ఉద్దేశంతో చెప్తున్నదో ఇద్దరికీ బోధపడటం లేదు.

"నా ఉద్దేశం మీ నిర్ణయాన్ని మార్చాలని కాదు. చేస్తున్న పని పట్ల పూర్తి అవగాహన వుండాలని. తప్పనిసరి పరిస్థితుల్లో చేసిన ఒక అబార్షన్ అల్ట్రాసౌండ్ వీడియో రికార్డు మీకిప్పుడు చూపిస్తాను. ఆ తర్వాత మీ నిర్ణయం ప్రకారం చేస్తాను" అంటూనే రిమోట్‌తో వీడియో ఆన్ చేసింది.

స్క్రీన్ మీద డిస్‌ప్లే మొదలైంది. అవయవాలు రూపుదిద్దుకొని, కాళ్లూ, చేతులూ కదిలిస్తున్న బిడ్డ కనిపిస్తోంది. ఏదో చెప్తున్నట్లుగా పెదాలు కదులుతున్నాయి. మెల్లగా ఒక ఆయుధం లోపలకు చొచ్చుకొచ్చింది. అది బిడ్డను తాకుతూనే ఉలిక్కి పడ్డట్టుగా కదిలింది. కాళ్లూ చేతులూ ముడుచుకున్నాయి. ఆత్మరక్షణ కోసం పోరాటం మొదలైంది. ఆయుధాన్ని బిగించి పట్టుకొంది. దూరంగా నెట్టేసే ప్రయత్నం చేస్తున్నది. ఆయుధం బలం పెరిగేకొద్దీ నిస్సహాయంగా గిలగిలలాడుతోంది.

"చూడండి. మీరు కేవలం మాంసపుముద్దనుకుంటున్న ఆ చిన్నారి ప్రాణి తన ప్రాణం కోసం ఎలా పోరాడుతుందో, బ్రతకాలని ఎంత ఆరాటపడుతుందో! మీరిప్పుడు చూస్తున్నది ఎవరి బిడ్డో కావచ్చు. రేపు మీ బిడ్డయినా అంతే. ముక్కలు ముక్కలుగా ఛిద్రం కావాల్సిందే" చెప్తున్నది డాక్టర్ సుమిత్ర.

"నో....నో.... డాక్టర్" ముఖాన్ని చేతుల్లో దాచుకొని భోరున ఏడ్చింది గీత. డాక్టర్ వీడియో ఆఫ్ చేసింది. మనోజ్ ముఖంలో నెత్తురు చుక్కలేదు.

"డాక్టర్! నెలలు నిండని ఒక బిడ్డ తన ప్రాణం కోసం అంత స్ట్రగులవుతుంటే, ఇంత వయసు, చదువు, జ్ఞానం వున్న మేం మా జీవితం పట్ల స్ట్రగుల్ కాలేమా? మా బిడ్డను చేతులారా చంపుకోం. మా భవిష్యత్తు కోసం మేం పోరాడగలం". దృఢంగా చెప్పింది గీత.

తను ఆశించిన స్పందన వారిలో కలగటంతో డాక్టర్ సుమిత్ర పెదవుల మీద చిరునవ్వు తొంగిచూసింది.

*(జనవరి 2009, ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రసారం)*

*(ఏప్రిల్ 2009, చినుకు 4వ వార్షిక ప్రత్యేక సంచిక)*